

## జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో సిల్వర్‌మెడల్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరిగిన నాలుగో జాతీయ ఫిన్ స్విమ్మింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొన్న శ్రీకాకుళం పట్టణానికి చెందిన యతిరాజ్యం బోణిఅశ్వద్ సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. మన రాష్ట్రానికి బాలుర విభాగంలో ఈయన ఒక్కడే సిల్వర్‌మెడల్ పొందారు. 2022, 2023, 2024 మూడేళ్లు ఏకధాటిగా సిల్వర్ మెడల్స్ సాధించి బోణి అశ్వద్ హ్యాట్రిక్ సాధించాడు. మొండేటివీధికి చెందిన బోణి అశ్వద్ సెయింట్ జోసెఫ్ స్కూల్ ఏడో తరగతి చదువుతున్నాడు. డీఎస్‌వో స్విమ్మింగ్ పూల్‌లో కోచ్ మురళి శిక్షణతో చిన్నతనం జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయిల్లో ఎన్నో మెడల్స్ సాధించాడు. జిల్లా కలెక్టర్లు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మినిస్టర్లతో సన్మానాలు పారితోషికాలు అందుకున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఈయన ఎంపిక వెనుక డీఎస్‌వో, కోచ్ మురళి చిన్నతనం నుంచి ఇచ్చిన ప్రత్యేక శిక్షణే కారణం.


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 27-11-2024

సంపుటి: 20 సంచిక: 207

పేజీలు: 4 వెల: రూ.1


# 'కొంప'లు ముంచడంలో అలుపెరుగని 'మన్నం' వీరుడు



గ్రీవెన్స్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేసి వచ్చిన బాధితులతో బీజేపీ నేతలు



సతీష్ సొంత ఇల్లు ఇదే..

- 23 మంది మహిళల నుంచి రూ.50లక్షలు వసూలు
- హుద్‌హుద్ ఇళ్లు మంజూరయ్యాయంటూ తాళాల అప్పగింత
- రాష్ట్ర సచివాలయంలో తిప్పి సొమ్ములు మింగేసిన ఘనుడు
- డబ్బులు వెనక్కి అడిగితే అట్రాసిటీ బెదిరింపులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

☛ ఆమధ్య గుజరాత్‌లో ఒకడు బంగారం షాప్‌కి వెళ్లి రెండు కిలోలు బంగారం కొన్నాడు. కోటి అరవై లక్షల నోట్ల కట్టలు ఇచ్చాడు. షాపోడు కౌంటింగ్ మెషీన్లలో పెట్టి కౌంట్ చేసుకుని ఓకే చెప్పాడు, వీడు బంగారంతో వెళ్లిపోయాడు. తర్వాత షాపతనికి తెలిసిందేటంటే.. ఆ నోట్లకట్టల్లో పైన, కింద ఒరిజినల్ నోట్లు, లోపల మాత్రం నకిలీ నోట్లు ఉన్నాయి. నకిలీ అంటే ఎలా? కలర్ తేడానో, ప్రింటింగ్ తేడానో కాదు.. వాటిలో గాంధీ బొమ్మ స్థానంలో అనుపమ్ ఖేర్ ఓ సినిమాలో గాంధీ వేషం వేసిన బొమ్మ ప్రింట్ అయ్యింది.

☛ గాంధీనగర్‌లో మోరిస్ స్యామ్యూల్ అనేవాడు నకిలీ న్యాయస్థానం స్టార్ట్ చేసేశాడు. 'షెషన్స్ కోర్ట్' అని బోర్డ్ పెట్టి జడ్జ్ కోట్ వేసుకుని, జడ్జ్ సీట్‌లో కూర్చుని 'ముద్దాయిని ప్రవేశపెట్టండి' అనగానే, పోలీసులు, లాయర్లు, బాధితులు అందరూ 'మాకు న్యాయం చేయండి', 'మాకు న్యాయం చేయండి' అంటూ ఇతని చుట్టూ మూగారు. ఇతను విచ్చల విడిగా న్యాయం చేస్తూ పోయాడు. ఈ తతంగం ఐదేళ్లు అప్రతిహతంగా సాగింది. ఈ ప్రాసెస్‌లో మనోడు బాగానే ఆస్తులు, స్థలాలు, పొలాలు వెనకేసుకున్నాడు.

☛ గుజరాత్‌లోని బికనీర్–మోర్బీ హైవేపై ఓ టోల్‌ప్లాజా ఉంది. ఆ టోల్‌ప్లాజా వాహనదారుల నుంచి అధిక టోల్ వసూల్ చేయడాన్ని చూసి, ఆ పక్క గ్రామంలోని ధర్మేంద్ర సింగ్ జాలా అనే వ్యక్తి 'ఆపండి ఈ అన్యాయం' అని నినదించాడు. ఎవరూ ఆపకపోవడంతో, ఆ టోల్‌ప్లాజాకి సమాంతరంగా 600 మీటర్ల దూరంలో మరో టోల్‌ప్లాజా నిర్మించి, బారికేడ్స్‌లో వెహికల్స్ వెళ్లేంత ఓపెనింగ్ తెరిచి, మట్టి రోడ్డు వేసి, ఒరిజినల్ టోల్‌రేట్‌లో 80 శాతం డిస్కౌంట్ ఇచ్చాడు. ఇంకేముంది, వాహనాలన్నీ అటు వెళ్లడం మొదలైంది. ఈ తతంగం రెండేళ్లు గడిచాక గానీ టోల్ కంపెనీకి అసలు విషయం తెలీలేదు.

☛ సందీప్ రాజ్‌పుత్ అనే మరో ట్యాలెంటెడ్ ఫెలో గుజరాత్‌లోని చోటా ఉదయ్‌పూర్ జిల్లా మోడేలీ తాలుకాలో, ఓ ప్రభుత్వ కార్యాలయం స్టార్ట్ చేసేశాడు. ఆదివాసీ సంక్షేమ పథకాల కింద ప్రభుత్వం ఖర్చు చేస్తున్న రూ.5 కోట్ల నిధుల్ని నొక్కేశాడు.

☛ కిరణ్ భాయ్ పటేల్ అనే మరో ప్రముఖుడు కాశ్మీర్ డీజీపీ ఆఫీస్‌కి వెళ్లి, తాను ప్రధాన మంత్రి ఆఫీస్ నుంచి ఓ స్పెషల్ ఆపరేషన్ కోసం కాశ్మీర్ వచ్చానని, తనకు ఫెసిలిటీస్ ఏర్పాటు చేయమని చెప్పాడు. అంతే, ఆ తర్వాత నాలుగు నెలలు అక్కడి ఫైవ్‌స్టార్ హోటల్‌లో బస, జెడ్ ప్లస్ సెక్యూరిటీ, ఫుడ్డూ, బెడ్డూ మొత్తం ప్రభుత్వ లాంఛనాలతో ఎంజాయ్ చేశాడు.



ఆఫీసులో ఎప్పుడూ ఖాళీగా దర్శనమిచ్చే సతీష్ సీటు

☛ రాజ్‌కోట్ జిల్లా పిపాలియా గ్రామంలో కొందరు నిరుద్యోగ యువకులు ఓ ఫేక్ స్కూల్ స్టార్ట్ చేసి, ఆరేళ్ల పాటు మధ్యాహ్న భోజన నిధులు చక్కగా ఆరగించారు.

ఇవన్నీ గుజరాత్‌లో జరిగితే చెప్పుకుంటారా.. తాను చేసింది మాత్రం చెప్పుకోరా? అనుకున్నాడో ఏమో? నగరంలో మంగువారితోటకు చెందిన పంచాయతీ కార్యదర్శి మన్నం సతీష్ హుద్‌హుద్ ఇళ్లు మంజూరు చేయిస్తానంటూ సొమ్ములు తీసుకొన్ని కొన్నాళ్ల తర్వాత వారి చేతిలో ప్లాట్ నెంబరుతో కూడిన కాగితం, తాళాల గుత్తి పెట్టాడు. తీరా అక్కడకు వెళ్లి చూస్తే అప్పటికే ఆ ఇళ్లు వేరేవారికి ప్రభుత్వం ఇచ్చేసింది. ఈ తాళాలు ఎక్కడివని ఆరాతీస్తే స్థానికంగా ఓ హార్డ్‌వేర్ షాపునకు వెళ్లి హోల్‌సేల్‌గా తాళాలు కొని వారి చేతిలో పెట్టేశాడు. ఈ విషయం తెలుసుకున్న బాధితులు లబోదిబోమంటూ ఫిర్యాదు చేశారు. విచిత్రమేమిటంటే.. సొమ్ములు తీసుకున్న మాట వాస్తవమేనని సతీష్ విచారణ జరిగిన ప్రతీచోట అంగీకరించడం. ఎందుకంటే.. కొందరు నేరుగా నగదు ఇస్తే, జేబులో అంత మొత్తం లేకపోతే ఫోన్ పే, అకౌంట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా అప్పటికప్పుడు సొమ్ములు తీసుకోవడంతో సతీష్ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోతున్నాడు. అయినా కూడా ఆయన మీద శాఖాపరమైన చర్యలు తీసుకోడానికి పంచాయతీ, జిల్లాపరిషత్ అధికారులు వెనుకడుగు వేస్తున్నారు.

ఉద్యోగాలు వేయిస్తానని ఒక ప్రభుత్వ ఉద్యోగి నిరుద్యోగుల నుంచి కోట్ల రూపాయలు వసూలుచేసినా జిల్లా అధికారులు ఇప్పటి వరకు

- మిగతా 4లో

# అదిగదిగో విశాఖ రైల్వేజోన్



ముడసర్లోవలో నిర్మించనున్న రైల్వేజోన్ కార్యాలయం నమూనా




- రూ.149 కోట్లతో టెండర్లకు ఆహ్వానం
- ముడసర్లోవలో 52 ఎకరాలు సిద్ధం
- 2వేల మందికి పరిపాలనా భవనం
- 11 అంతస్తుల నిర్మాణానికి రెండేళ్ల గడువు





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విశాఖకు రైల్వేజోన్ వచ్చేస్తుందని కొద్ది రోజుల క్రితం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు. 'ఎప్పట్నుంచో ఉత్తరాంధ్ర ప్రజల స్వప్నంగా ఉన్న రైల్వేజోన్ వస్తే కొత్త రైళ్లొస్తాయా? శ్రీకాకుళం లాంటి ప్రాంతాల్లో పాత రైళ్లు ఆగుతాయా?' ..ఇవి సగటు ప్రయాణీకుడిలో కలిగే సందేహాలు. కేవలం రైల్వేజోన్ రావడమంటే రైళ్లు రావడం మాత్రమే కాదు.. 3వేల మంది ఇక్కడ ఉద్యోగానికి వస్తారు. ముడసర్లోవ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నందున ఈ ప్రాంతం మొత్తం అభివృద్ధి చెందుతుంది. ఈ కార్యాలయానికి అనుబంధంగా అనేక సంస్థలు ఏర్పాటవుతాయి. విశాఖపట్నంలో స్టీల్‌ప్లాంట్ పెట్టడం వల్ల రాష్ట్రంలో పశ్చిమగోదావరి జిల్లా వరకు ఎంతమందికి ఉపాధి లభించిందో మనకు తెలుసు. ఇప్పుడు అంత పెద్ద ఎత్తున కాకపోయినా విశాఖ రైల్వేజోన్ వల్ల ఎకనామికల్ డెవలప్‌మెంట్ కచ్చితంగా ఉంటుంది.

జోన్ కార్యకలాపాలు ప్రారంభించాలంటే ఒక జనరల్ మేనేజర్, ఆయన సపోర్టింగ్ స్టాఫ్, కొన్ని కార్యాలయాలు ఉంటే చాలు. మొత్తంగా దీనికి 2వేల మంది ఉద్యోగులు అవసరమవుతారు. పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించే నాటికి వారి సంఖ్య క్రమంగా 3వేలకు చేరుతుంది. ఇప్పటికే ఇక్కడ పని చేస్తున్నవారు కొందరు ఉన్నారు కాబట్టి డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఆపరేటింగ్ డిపార్ట్‌మెంట్, కంట్రోల్ రూం, ఆడిటోరియం, మెకానికల్.. ఇలా మొత్తం 18 రకాల విభాగాలు, దానికి సంబంధించిన అనుబంధ కార్యాలయాలలో పనిచేయాల్సి ఉంటుంది.

### వచ్చే నెల 27లోగా టెండర్లకు అవకాశం

రైల్వేజోన్ కార్యాలయం నిర్మాణానికి రైల్వేశాఖ టెండర్లను ఆహ్వానించింది. అర్హత కలిగిన సంస్థలు డిసెంబర్ 27లోగా టెండర్లు దాఖలు చేయాలని ప్రకటనలో ప్రభుత్వం పేర్కొంది. టెండర్లు దక్కించుకున్న సంస్థలు రెండేళ్లలో భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని తెలిపింది.

### తొలి బీజం ఎక్కడ పడింది?

2019 ఫిబ్రవరి 27న కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. 2019 మార్చి 8న దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ) నియమించారు. 2019 సెప్టెంబర్ మొదటి వారంలో రైల్వే జోన్‌కు సంబంధించిన డీపీఆర్‌ను రైల్వే బోర్డుకు అందజేశారు. ఆ తర్వాత కూడా జోన్‌కు సంబంధించిన ఎటువంటి పనులు ప్రారంభం కాలేదు. రైల్వేజోన్ కార్యాలయం కోసం కేటాయించిన భూములపై వివాదం నెలకొనడమే పనులు ప్రారంభం కాకపోవడానికి కారణమంటూ కేంద్ర, అప్పటి రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పుకొచ్చాయి.

విశాఖలో రైల్వేజోన్ కార్యాలయం నిర్మాణానికి కావాల్సిన 52 ఎకరాల భూమిని ఏపీ ప్రభుత్వం తమకు అప్పగించలేదని రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ 2024 ఫిబ్రవరి 2న ఢిల్లీలో చెప్పడం అప్పట్లో పెద్ద సంచలనానికి తెరలేపింది. కానీ ముడసర్లోవలోని శ్రీకృష్ణాపురంలో సర్వే నెంబరు 26లోని జీవీఎంసీ భూమిని సిద్ధం చేశామని అప్పటి కలెక్టర్ చెప్పారు. అక్కడ భూమికి సరిహద్దులు నిర్ణయిస్తూ పొడవాటి గోతులు కూడా తవ్వామని, ఆ భూమినే కేంద్ర ప్రభుత్వానికి అప్పగించేందుకు సిద్ధం చేశామని, ఆ విషయాన్ని కేంద్రానికి తెలియజేశామని అప్పటి విశాఖ కలెక్టర్ ఎ.మల్లికార్జున ప్రెస్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. అయితే రైల్వే జోన్ కార్యాలయాలు, ఇతర నిర్మాణాల కోసం రైల్వే శాఖ ఆ భూములను పరిశీలించగా.. అవి విశాఖ తాగునీటి అసవరాలను తీర్చే ముడసర్లోవ రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ భూములను తీసుకునేందుకు రైల్వేశాఖ నిరాకరించింది. కానీ భూముల విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేవని, ఈ భూములనే కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తున్నట్లు మల్లికార్జున చెప్పుకొచ్చారు. ఆ తర్వాత మళ్లీ రైల్వే జోన్‌పై ఎటువంటి ప్రకటనలు రాలేదు. ఇంతలో ఏపీలో ప్రభుత్వం మారింది.



నిర్మాణం జరగాల్సినచోట ఉన్న తోటలు

### రైల్వే భూమినే రైల్వేశాఖకు కేటాయించారు

జోన్ కార్యాలయం ఏర్పాటు చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయించాలి. కానీ గత ప్రభుత్వం రైల్వేకు ఇచ్చిన భూమిని మళ్లీ జోన్ కోసం కేటాయించినట్టు ప్రకటించడం వల్లే తమకు భూమి ఇవ్వలేదని అశ్వనీ వైష్ణవ్ చెప్పుకొచ్చారు.

పదేళ్ల కిందట రెండు బీఆర్టీఎస్ (బస్ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టం) రోడ్ల నిర్మాణం కోసం రైల్వే భూములను జీవీఎంసీ (గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్) తీసుకుంది. అంతేకాకుండా 1987 నుంచి 2007 వరకు వివిధ అవసరాల కోసం రైల్వే భూములను ఏపీ ప్రభుత్వం తీసుకుంది. దీంతో ఆ భూములకు బదులుగా ముడసర్లోవలోని శ్రీకృష్ణాపురంలో 52 ఎకరాలను జీవీఎంసీ ద్వారా రైల్వేకు కేటాయించింది. అయితే ఈ భూముల హక్కుదారులమంటూ అక్కడున్న కొందరు గిరిజనులు ఆందోళనలు చేశారు. అధికారులకు అర్జీలు పెట్టుకున్నారు.

1975లో అగ్నిప్రమాద బాధితులకు అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ 52 ఎకరాల భూములను కేటాయించారు. మొత్తం ఇక్కడ 78 ఎకరాల భూమిపై గిరిజనులకు డి–పట్టాలున్నాయి. డి–పట్టా అంటేనే ప్రభుత్వానికి ఎప్పుడు అవసరముంటే అప్పుడు వెనక్కు తీసుకునే వెసులుబాటు ఉంటుంది. ఇక్కడ జీవీఎంసీ అధికారులు అదే చేశారు. గిరిజనుల డి–పట్టా భూములు, రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో భూముల వివాదం నడుస్తూ రైల్వే జోన్ పనుల ప్రక్రియలో ఎటువంటి కదలిక కనిపించలేదు.

ప్రస్తుతం టెండర్లను ఆహ్వానించి దక్షిణ కోస్తా రైల్వేజోన్ కార్యాలయాలను రూ. 149.16 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. గతంలో రైల్వేశాఖకు ఏపీ ప్రభుత్వం కేటాయించిన ముడసర్లోవలోని 52 ఎకరాల స్థలంలోనే ఈ నిర్మాణాలు జరగనున్నాయి. రిజర్వాయర్ పక్కనే ఉండటంతో ఏమైనా ఇబ్బందులు వస్తాయేమోనని గతంలో రైల్వేశాఖ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. అయితే అటువంటి ఇబ్బందేమీ రాదని రాష్ట్రప్రభుత్వం స్పష్టతనివ్వడంతో ఇప్పుడు ఆ భూములను ఓకే చేసింది. మొత్తం 11 అంతస్తుల్లో భవన నిర్మాణం జరగనుంది. ఇందులో రెండు సెల్లార్ పార్కింగ్ ఫ్లోర్లు ఉండనున్నాయి.

• ఎడిటోరియల్

# భారత్ సెక్యులర్ దేశమే..

భారత రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో లౌకికవాదం అంతర్భాగమని అత్యున్నత న్యాయస్థానం నొక్కిచెప్పింది. పీఠిక అసలు సిద్ధాంతాలు లౌకిక ధర్మాన్ని ప్రతిబింబిస్తాయని స్పష్టం చేసింది. రాజ్యాంగ ప్రవేశికలోని 'సోషలిస్ట్', 'లౌకిక' పదాలు రాజ్యాంగంలో అంతర్భాగమని, వాటిని పాశ్చాత్య దృక్పథంతో చూడాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. రాజ్యాంగ పీఠిక నుంచి సెక్యులరిజం, సోషలిజం అనే పదాలను తొలగించాలంటూ దాఖలైన పిటిషన్లను సుప్రీం తోసిపుచ్చింది. 1976లో 42వ రాజ్యాంగ సవరణతో సెక్యులరిజం, సోషలిజం వంటి పదాలను జోడించారు. బీజేపీ మాజీ ఎంపీ సుబ్రమణ్య స్వామి, న్యాయవాది విష్ణుశంకర్ జైన్, బలరాం సింగ్, అశ్వినీకుమార్ ఉపాధ్యాయ దాఖలుచేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు గతవారం వాదనలు విని తీర్పును రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పివి సంజరు కుమార్‌లతో కూడిన ధర్మాసనం తీర్పునిచ్చింది. ఈ పిటిషన్‌ను తిరస్కరించిన ధర్మాసనం 'పిటిషన్‌ను వివరంగా విచారించాల్సిన అవసరం లేదు' అని స్పష్టం చేసింది. 1976లో రాజ్యాంగ సవరణతో సెక్యులరిజం, సోషలిజం తదితర పదాలను చేర్చారని, ఇక 1949లో ఆమోదించిన రాజ్యాంగానికి ఎలాంటి తేడా లేదని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా పేర్కొన్నారు. సోషలిస్ట్, సెక్యులర్ అనే పదాలకు వివరణలు ఉన్నాయని, వాటిని వేర్వేరుగా అన్వయించకూడదని ధర్మాసనం అభిప్రాయపడింది. సోషలిజం అంటే అందరికీ సమాన అవకాశాలు ఉండాలని, సమానత్వం అనే అంశాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపింది. దాన్ని మరో రకంగా చూడొద్దని స్పష్టం చేసింది. దేశం సోషలిస్టు సంక్షేమ రాజ్యంగా ఉండటానికి ఉద్దేశించిందని స్పష్టం చేసింది. భారత రాజ్యాంగ మౌలిక స్వరూపంలో 'సెక్యులరిజం' అనేది అంతర్భాగమని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు సంబంధించిన ఆర్టికల్ 14, 15, 16లో కూడా చూడొచ్చని పేర్కొన్నారు. ఇది మతపరమైన ప్రాతిపదికన పౌరుల పట్ల వివక్షను నిషేధిస్తుందని, అన్ని మతాలను సమానంగా చూస్తుందని తెలిపింది. ఇదే రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 25, 26, 29, 30, 44 సారాంశంలో కూడా కనిపిస్తుందని తెలిపారు. సోషలిజం, లౌకికవాదం మన రాజ్యాంగ ప్రాథమిక లక్షణమని స్పష్టం చేసింది. 1976 కంటే ముందు పీఠికలో సెక్యులర్ పదం లేనప్పటికీ, లౌకికవాదం తప్పనిసరిగా దేశం నిబద్ధతను సూచిస్తుందని పేర్కొంది. 1994 నాటి ఎస్ఆర్ బొమ్మై కేసులోనూ, కేశవానంద భారతి కేసులోనూ ఇదే చెప్పినట్లు సుప్రీంకోర్టు గుర్తు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 రాజ్యాంగాన్ని సవరించే అధికారాన్ని పార్లమెంట్ ఇస్తుందని, అయితే అది సవాల్ చేయలేమని స్పష్టం చేసింది. అదే సమయంలో మీరు నివసించే దేశానికి మద్దతివ్వండి, లేదా మీరు మద్దతిచ్చే దేశానికి వెళ్లి జీవించండి అని బీజేపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. రాజ్యాంగ పీఠికలో సెక్యులరిజం అనే పదం తొలగించాల్సిన అవసరంలేదని సుప్రీంకోర్టు పేర్కొన్న వెంటనే ఈ నినాదాన్ని ఎత్తుకున్నారు. మీరు నివసించే దేశానికి మద్దతివ్వండి అనడంలో మీరు అలా మద్దతివ్వడంలేదు సుమా అని చెబుతున్నట్లుంది. అలా మీరు మద్దతివ్వడంలేదు కాబట్టే మిమ్మల్ని హెచ్చరిస్తున్నామన్న అంతర్లీన పెద్దరికమూ ఉంది. దేశ రాజ్యాంగం ప్రకారం సంక్రమించిన హక్కుల్ని వారు ఎంత అనుభవిస్తారో, ఈ దేశ పౌరులందరూ అలానే అనుభవిస్తారు. ఇందులో ఎవరి పెద్దరికాలూ అవసరంలేదు. దేశ స్వతంత్ర పోరాటం జరుగుతూ కొంతమంది ఉరితాళ్లను మెడకు తగిలించుకొని ఉరితాళ్లను ముద్దాడుతున్నప్పుడు, మరికొంతమంది దశాబ్దాలపాటు జైళ్లలో మగ్గినప్పుడు గుర్తుకురాని మతం ఇప్పుడు సెక్యులరిజం పదంతో పాటు ఆ భావన కొనసాగాలంటే మాత్రం విలవిలలాడిపోతున్నారు. దేశం స్వయంసమృద్ధి అయిన తర్వాత ఇప్పుడు బయటకువచ్చి మెజార్టీ మతాన్ని ఉద్ధరిస్తున్నట్టు ఫోజులు కొడుతున్నారు. ఫత్వాలు జారీ చేస్తున్నారు. 'కులమతాల గోడల మధ్య బంధీకాకుండా ఉండే విశ్వనరుడను నేను' అనే జాషువా మాటలు నేటి తరానికి తెలీకపోవచ్చు. దేశ పౌరుల మీద ఏ ఒక్కరికో అయాచితంగా హక్కు ఉన్నట్లు ఫీలవడం సరికాదు. ఈ దేశంలో ఉన్నవారంతా భారతీయులే. కుల, మత, ప్రాంత భావనలకు అతీతంగా పాలించాల్సింది ప్రభుత్వాలు మాత్రమే.



# స్వస్తిక్.. దాని కథ!

హిందువులకు, జైనులకు, బౌద్ధులకు అత్యంత పవిత్ర చిహ్నం అయిన స్వస్తికాను ఇరవైవ శతాబ్దం మొదటి అర్ధ భాగంలో ఒక వ్యక్తి తన అధికార దాహానికి స్వస్తికాను బలిచేసి ఎంతటి చెడ్డపేరు, మాయనిమచ్చ తీసుకువచ్చాడో గుర్తుచేసుకుందాం. మనం ఎంతో పవిత్రంగా భావించే స్వస్తికా గుర్తును దొంగిలించి తన నాజీ పార్టీ ముఖ్య గుర్తుగా వాడుకొని తరువాతి తరాలకు స్వస్తికాను చూస్తే నియంతృత్వ నాజీ అధినేత గుర్తుకు వచ్చేలా మాయనిమచ్చ తెచ్చాడు ప్రపంచాన్ని గడగడలాడించిన హిట్లర్.



స్వస్తికా అంటే సంస్కృతంలో "శ్రేయస్సు" అని అర్థం. ఆంగ్ల అక్షరం "ఎస్" రెండు అడ్డంగా పేరుస్తే వచ్చే గుర్తు అని సులువుగా చెప్పవచ్చు స్వస్తికాను. ఈ క్రాస్ ఆకారంలో వుండే స్వస్తికాకు చాలా విశిష్టమైన స్థానం ఉంది మన వేద కాలం నుంచి. ఎన్నో వేల ఏళ్ల చరిత్ర ఉంది స్వస్తికాకు. ఆ గుర్తు హితం కోరేది, యుద్ధచిహ్నం కాదు. మన ప్రాచీనకాలం నుంచి శ్రేయస్సు కోసం ఆ గుర్తు వాడిన దాఖలాలు ఉన్నాయి. మన పూర్వీకుల నుంచి ప్రస్తుత కాలంలో కూడా ఏ గ్రంథం రాసినా మొదటి పుటలో రాసేది స్వస్తికా గుర్తునే! అది రాసిన తరువాతే, ఆ గుర్తుకు పసుపు కుంకుమ రాసి పూజ చేసి పుస్తకం రాయడం ప్రారంభించడం ఆనవాయితీ. అందరి శ్రేయస్సు కొరడమే వారి ఉద్దేశ్యం.

అంతటి గొప్ప చరిత్ర కల గుర్తు.. గత శతాబ్దంలో మొదటి అర్ధభాగంలో అణిచివేతకు, ఒక జాతిని ప్రపంచ పటం మీద నుంచి చేరిపివేసే ప్రయత్నానికి గుర్తుగా యూరోప్, అమెరికా దేశస్థుల మదిలో నిలిచిపోయింది.

అతి పురాతనమైన స్వస్తికా ఎన్నో వేల ఏళ్ల క్రితం గతించిపోయిన ఏనుగుల్లో ఒక జాతి అయిన మామ్మోత్ ఏనుగు దంతాల మీద చెక్కబడి రష్యాలో దొరికింది. ఈ మామ్మోత్ జాతి ఏనుగు డైనోసార్‌ల కాలం నాటిది అంటే ఎంత పురాతనమైందో ఊహించండి. మన వేదాలు అంతకన్నా ముందు కాలానివి, వేదాల్లో ఈ స్వస్తికా గుర్తును విస్తృతంగా వాడారు. ఆ కాలంలో స్వస్తికాను సంతానోత్పత్తికి చిహ్నంగా కూడా కొన్ని ప్రాంతాలవారు వాడినట్టు తెలుస్తోంది. అప్పట్లో ఏనుగును కూడా శ్రేయస్సు, సంతానోత్పత్తికి గుర్తుగా వుండబట్టి ఆ మామ్మోత్ ఏనుగు దంతంతో స్వస్తికాను చెక్కారు అని తెలుస్తోంది. విడిగా స్వస్తికా ప్రత్యక్షమైంది యూరోప్లోని తూర్పు దక్షిణ ప్రాంతం, నియోలిథిక్ విన్క సంస్కృతి కాలంలో అంటే సుమారు ఏడు వేల ఏళ్ల క్రితమే.. కాంస్య కాలానికి యూరోప్ మొత్తం స్వస్తిక లభ్యమయ్యేది. పంతొమ్మిదవ శతాబ్దానికి పశ్చిమ దేశాలు అన్నిటికీ పాకింది స్వస్తికా. ప్రతిదాంట్లో, ప్రకటనలో, డిజైన్లలో, హాకీ, ఫుట్బాల్ క్రీడాకారుల జెర్సీల మీదకు పాకింది స్వస్తికా. ఎవరు పడితే వారు, వారికిష్టమైన రీతిలో వాడుకోవడం ప్రారంభించారు. అంతెందుకు మొదటి ప్రపంచ యుద్ధంలో అమెరికా సైన్యం వారి దుస్తులమీద స్వస్తికాను ముద్రించిది లేదా విడిగా కుట్టించింది. నాజీ పార్టీ, జర్మనీలో 1935 నుంచి తమ పార్టీ చిహ్నంగా, జెండా పైనా, అన్ని వస్తువుల మీద ఎరుపురంగు మధ్యలో స్వస్తికాను వాడేవారు. బ్రిటన్‌కు చెందిన రాయల్ ఎయిర్‌ఫోర్స్ 1939 దాకా ఈ స్వస్తికాను తమ యుద్ధ విమానాల మీద ముద్రించేవారు. హిట్లర్ యుద్ధ దాహంతో స్వస్తికాకు ఓ కొత్త గుర్తింపు వచ్చింది! మంచికి కాదు, చెడుకి చిహ్నంగా!! కొద్దిమంది జర్మన్ పండితులు స్వస్తికాకు కొత్త భాష్యం చెప్పడం ప్రారంభించారు సంస్కృత భాషలో ఉన్న స్వస్తికాతో పోలుస్తూ, ఆ గుర్తు తమ బాష వల్ల ఉద్భవించిందని కొత్త పాఠం ప్రారంభించారు. వారు కప్పిపెట్టిన విషయమేమిటంటే జర్మన్ వారి భాషామూలాలు సంస్కృతం వల్ల వచ్చాయని. నరరూప రాక్షసులైన నాజీలు ఇంకో రకంగా ఊహించుకుని పురాతన భారతీయుల నుంచి తమ పూర్వీకులు వచ్చారని, అందువల్లే తమ జాతి పురాతన దేవుని యుద్ధవీరుల(ఆర్యులు) నుంచి ఉద్భవించిందనీ.. కొత్త పల్లవి అందుకున్నారు. నాజీలు 1939కి అధికారం పూర్తిగా హస్తగతం చేసుకుని యూదులను ఊచకోత కొయ్యడం ప్రారం భించారు. అరవై లక్షల మంది యూదులను జర్మనీ, పోలాండ్, నెదర్లాండ్స్.. ఇలా తాము ఆక్రమించుకున్న దేశ యూదులను అత్యంత దారుణంగా చంపారు. ఎలా ఎంత పాశవికంగా చంపారో ఇంకో వ్యాసంలో తెలుసుకుందాం. జర్మనీ హిట్లర్ అధికారంలోవున్న ఆరేళ్ళు.. ప్రపంచాన్ని అస్తవ్యస్తం చేసింది. ఈ నాజీల పాలనలో, కొద్దిగా వంకరగా, నల్లటి వృత్తంలో ఉన్న స్వస్తికా.. వెనుకాల ఎరుపురంగు కనిపిస్తే సామాన్యులు భయభ్రాంతులకు గురయ్యేవారంటే ఊహించండి. పవిత్రమైన స్వస్తికాను ఏ స్థితికి తీసుకెళ్లారో..? నాజీల స్వస్తికా అణిచివేతకు, మారణహోమానికి చిహ్నంగా మారిపోయింది. ఈరోజుకీ స్వస్తికాను చూస్తే యూదుల వెన్నులో వణుకు స్పష్టంగా కనిపిస్తుంది. కారణం తమ తల్లితండ్రులు, తాతలు, బామ్మలు,అమ్మమ్మలను, ఇతర దగ్గర బంధువులను ఎంత పాశవికంగా చంపారో వారికి మాత్రమే ఆ బాధ స్పష్టంగా తెలుసు. నాజీల శకం అంతమయ్యి డెబ్బై ఐదు సంవత్సరాలు అయినా.. స్వస్తికా మీద అభిప్రాయం మాత్రం వారిలో మారలేదు. ఈమధ్యనే 2007లో జర్మనీ దేశం నాజీల స్వస్తికా గుర్తును నిషేధించింది. ఒక సడలింపుతో, ఇతర మతాల వారు, దేశస్థులు తమ సంస్కృతికి చిహ్నంగా ఉన్న స్వస్తికాను.. ముఖ్యంగా తూర్పు, దక్షిణ ఆసియా దేశస్థులకు మినహాయింపు ఇచ్చింది ప్రభుత్వం. - సుబ్రహ్మణ్యం వల్లూరి



సహజమే.. అక్కినేని ఇంటికి కోడలిగా రాబోతున్నదంటే ఆమె ఎవరూ అనే సెర్చింగ్ సహజమే.. తన కొడుకు అఖిల్‌తో జైనాబ్ రవ్‌జీకి ఎంగేజ్‌మెంట్ అయ్యిందని చెప్పాడు నాగార్జున..అఖల్ కూడా రెండు మూడు ఫోటోలు ట్వీటాడు.. ఆమె ఎవరు అనే వివరాలు నెట్‌లో కూడా పెద్దగా ఉండవు.. తెలిసిన సమాచారం మేరకు ఆమె హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగింది. నెట్‌లో ఆమె పేరుతో ఒక ప్రొఫైల్ ఉంటుంది. ఆమె అప్పుడెప్పుడో మీనాక్షి అనే సినిమా చేసింది. అదొక్కటే సినిమా.. ఇక ఏ వివరాలూ ఉండవు. కానీ 2004లో సినిమా అంటే ఇప్పటికి 35 ఏళ్లపైనే కదా.. కానీ ఇప్పుడు అఖిల్ పెళ్లి చేసుకోబోయే జైనాబ్ బహుశా వేరే అమ్మాయి కావచ్చు.. (అఖిల్ వయస్సు 30.. తనకంటే ఎక్కువ వయస్సు ఉండకూడదని ఏమీ లేదు). కానీ కొన్ని వార్తల మేరకు అఖిల్ చేసుకోబోయే అమ్మాయి ఆర్టిస్టు. ఆమె తండ్రి జుల్ఫీ కూడా ఆర్టిస్ట్ కం బిజినెస్‌మాన్.. గతంలో ఈ ఫ్యామిలీకి ఓడియన్ థియేటర్ ఉండేది. హైదరాబాదులో కూడా గతంలో రిఫ్లెక్షన్స్ పేరిట కళాకృతి ఆర్ట్ గ్యాలరీలో అప్పట్లో ఆమె ఓ పెయింట్ ఎగ్జిబిషన్ కూడా పెట్టింది. ఎక్కువగా మోడరన్, అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్స్ వేస్తుందని సమాచారం. ప్రియాంక గాంధీకి తన పోర్ట్రెయిట్ చిత్రించి బహూకరించినట్టు ఓ వార్త..

# జైనబ్ రవ్‌జీ.. అఖిల్ పెళ్లాడేది..ఎవరీమె?

ప్రస్తుతం ముంబైలో ఉంటుంది. చాలా లోప్రొఫైల్.. ఎక్కువగా దుబాయ్, లండన్, ఇండియాల మధ్య సంచారం.. అఖిల్‌తో ఎలా పరిచయమనేదీ గోప్యమే.. తన గరల్ ఫ్రెండే.. అప్పట్లో అంటే 2016లో ప్రముఖ వ్యాపారవేత్త జీవీకే మనమరాలు శ్రియా భోపాల్‌తో నిశ్చితార్థం జరిగాక, పెళ్లి గాకముందే బ్రేకప్..

ఆ తరువాత ఈమె పరిచయం అయినట్టుంది. ఆరేళ్లుగా ఇద్దరి మధ్య ప్రణయం అట.. ఇంతకుమించి ఆమె వివరాలు ఎవరికీ తెలియవు. అక్కినేని కుటుంబం కూడా ఆమె వివరాల వెల్లడికి విముఖంగా ఉన్నట్టుంది.. (బహుశా ఆర్ట్ గ్యాలరీలతో పరిచయం ఉన్నవాళ్లకు ఆమె గురించి తెలిసి ఉంటుంది)

అఖిల్ విషయానికి వస్తే, ఇండస్ట్రీలోకి వచ్చి తొమ్మిదేళ్లయినా సరే, ఇప్పటికీ తన కెరీర్ గాడిలో లేదు. తను అమెరికాలో పుట్టాడు, ఇప్పటికీ అమెరికన్ పౌరసత్వమే తనది.. అఖిల్ సోదరుడు నాగచైతన్యకు మొదటి వివాహం సమంతతో.. ఆమధ్య విడిపోయారు.. రీసెంటుగా ధూళిపాళ శోభిత అనే నటితో తనకు ఎంగేజ్‌మెంట్ అయ్యింది, వచ్చే నెల నాలుగున పెళ్లి.. ఈలోపు ఈ 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్'కూ నిశ్చితార్థం జరిగిపోయిందని అక్కినేని కుటుంబం ప్రకటించింది. అత్యంత సన్నిహితుల మధ్య జరిగినట్టుంది.. అందుకే సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. కాబోయే భార్య లోప్రొఫైల్.. అఖిల్ కూడా పెద్దగా వార్తల తెర మీదకు రాడు. సోషల్ మీడియాలో కూడా పెద్ద యాక్టివ్‌గా ఉండడు. అందుకే ఏ సినిమా మీడియా కూడా వాళ్ల ప్రేమ వ్యవహారాన్ని పట్టుకోలేకపోయింది.



# ఆ నర్సు గుర్తుపట్టకపోయి ఉంటే.. ఓ అనామకుడిగానే 'వెళ్లిపోయేవాడు'!!

కొన్ని జీవితాలు.. అవీ సినిమా జీవితాలు.. సినిమా కథలను మించి ఉంటాయి. విషాదమే కాదు, విచిత్రంగా ముగుస్తుంటాయి. కులశేఖర్ జీవితం ఓ పర్‌ఫెక్ట్ ఉదాహరణ. ఓ వ్యక్తి ఒంటరిగా అమీర్‌పేటలో దారెంట నడుస్తూ పోతుంటాడు. హఠాత్తుగా కుప్పకూలిపోతాడు.. స్థానికులు ఎవరో 100 నంబర్‌కు ఫోన్ చేస్తే, పోలీసులు వచ్చి, గుర్తుతెలియని వ్యక్తిగా నమోదు చేసుకుని, గాంధీ హాస్పిటల్‌లో చేర్పిస్తారు.

అక్కడా పేరు లేని రోగిగా నమోదు.. ఎవరు పట్టించుకుంటారు..? అదే రాత్రి మరణిస్తాడు.. అనామకుడిగానే మార్చురీకి తరలించే సమయంలో అనుకోకుండా ఓ నర్సు తనను గుర్తుపడుతుంది. ఓ పాటల రచయిత కన్నుమూశాడనే వార్త లోకానికి తెలుస్తుంది.

లేకపోతే..? ఆ నర్సు గుర్తుపట్టకపోతే.. నిజానికి తనున్న స్థితిలో పరిచయస్తులే తనను గుర్తుపట్టలేని దుస్థితి. చాన్నాళ్లుగా అసలు ఆయన తెర మీదే లేడు. ప్రజెంట్ తరానికి తెలియదు.. ఐనా ఆమె గుర్తుపట్టడం విశేషమే.. ఆమే గుర్తించకపోతే ఆ కులశేఖరుడు ఓ అనామక శవంగా కాల్చివేయబడేవాడేమో!! ఇదీ కాస్త బాధనిపించింది. మంచి ప్రతిభ ఉన్న రచయిత.. ఒకప్పుడు వెలిగినవాడే.. సింహాచలంలో తనది పెద్ద, సాహిత్య కుటుంబం. తండ్రి పేరున్న సంస్కృత పండితుడు. మహామహోపాధ్యాయ అనే బిరుదు ఉంది. హైదరాబాద్ వచ్చి కులశేఖరుడు ఒకవైపు టీవీ జర్నలిస్టుగా చేస్తూనే సిరివెన్నెల దగ్గర శిష్యరికం చేశాడు.

ఆర్పీ పట్నాయక్‌తో పరిచయం, తద్వారా తేజకు పరిచయం.. పాటల రచయితగా అవకాశం.. అప్పట్లో వీళ్లది సూపర్ హిట్ కాంబినేషన్. తరువాత ఇతర సినిమాలకూ రాశాడు. అన్నీ మంచి పేరు తెచ్చిపెట్టాయి. భార్య, ఇద్దరు పిల్లలు.. జీవితం ఇలాగే సాఫీగా సాగితే కథేముంది..?

విధి వక్రించింది.. ఏదో సినిమాకు దర్శకత్వం వహించాడు కూడా.. తరువాత హఠాత్తుగా మానసికంగా దెబ్బతిన్నాడు. ఏదో అంతుపట్టని మానసిక వైకల్యం.. కుటుంబానికి దూరంగా ఏం చేసేవాడో ఎవరికీ తెలియదు. అనుకోకుండా ఏదో గుళ్లో శఠగోపం దొంగిలించినట్టు ఆరోపణ.. అరెస్టు..

అసలు శఠగోపం దొంగిలించడం ఏమిటి తను..? తర్వాత ఇంకేదో గుడిలో బ్యాగ్ చోరీ కేసు ఏమిటి..? తన కథలోనే ఏదో తేడా ఉంది. కొన్నాళ్లపాటు కోమాలో ఉండిపోయాడుట.. తరువాత స్వస్థుడయ్యాడు గానీ పాత కులశేఖరుడు కాలేకపోయాడు.. చివరకు ఇదుగో అయోగ్యుడై, అర్థరహిత జీవుడై చివరకు ఇలా ఓ అనామకుడిగా, దిక్కులేని మరణానికి గురయ్యాడు.

ప్చ్, బాధాకరం.. ఎవరు పట్టించుకున్నారు, ఎవరు మోసగించారు, ఎలా బతుకు దెబ్బతిన్నదీ అనే వివరాలు ఇప్పుడిక అప్రస్తుతం.. ఒక ప్రతిభ కలిగిన బుర్ర 'పెన్నుమూసింది'.. అదీ దయనీయంగా.. అదే కాస్త కలుక్కుమనిపించే కథ..

- ముచ్చట సౌజన్యంతో...

## మోడల్ స్కూల్ సిబ్బందిని ఆదుకోండి

(సత్యంన్యూస్, బూర్జ)

రాష్ట్రంలో ఉన్న 164 మోడల్ స్కూల్ లో ఔట్సోర్సింగ్ విధానం ద్వారా పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందిని కాంటాక్ట్ ఉద్యోగాలుగా పరిగణించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘు వర్మను కోరారు. బుధవారం ఓవీ పేట మోడల్‌స్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీ స్టేట్ మోడల్ స్కూల్ అటెండర్ అండ్ వాచ్ మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జి నీలాద్రి ఆధ్వర్యంలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఎమ్మెల్సీని కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో 164 మోడల్‌స్కూల్స్‌లో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పని చేస్తున్నామన్నారు. తామంతా జీవో నెంబర్ 254 ద్వారా రిక్రూట్మెంట్ అయ్యామని కానీ ఆ రెండు క్యాటగిరీల వారిని కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి గత ప్రభుత్వం తమకు అన్యాయం చేసిందని, తమను కూడా కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ వారి ఆవేదంలో వివరించారు. అంతేకాకుండా పని భారం ఎక్కువ అవుతుందని శ్రమకు తగ్గ ప్రతిఫలం రావడం లేదని ఆయుర్వేదం తెలియజేశారు తనకు సానుకూలంగా స్పందించి తమకు న్యాయం చేకూర్చేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు



## విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి

(సత్యంన్యూస్, సరుబుజ్జిలి)

విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలని, తద్వారా చదువు లోనూ రాణించాలని రొట్టవలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రామకృష్ణారావు కోరారు. ఇటీవల సత్యసాయి సేవా సంస్థలు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బుధవారం ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను బహుకరించారు. సంస్థ జోనల్ కన్వీనర్ ఎం.జనార్ధనరావు విద్యార్థులకు సాయి సందేశాన్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ సేవా సమన్వయకర్త ఎం.రవీంద్రబాబు, యూత్ కో-ఆర్డినేటర్ జి.పవన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# మధుమేహ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

(సత్యంన్యూస్, పొందూరు)



యావత్ ప్రపంచాన్ని వణికిస్తున్న మధుమేహ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లయన్స్ జిల్లా (డయాబెటిస్) ఛైర్‌పర్సన్ డాక్టర్ వై.మల్లిబాబు అన్నారు. మధుమేహవ్యాధి చైతన్య మాసం సందర్భంగా బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రపంచంలో 53.7కోట్లు, మనదేశంలో 10కోట్ల మంది ఈ వ్యాధితో సతమతమవుతున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. పాంక్రియాస్‌లో తగినంత ఇన్సులిన్ ఉత్పత్తికాక పోవడం వల్ల చక్కెర వ్యాధి వస్తుందన్నారు. ఈ వ్యాధి వంశపారంపర్యంగా వస్తుందని, కాలుష్యం, మానసిక ఒత్తిడి, మాదకద్రవ్యాలు, వ్యాయామం లేకపోవడం వల్ల కూడా వస్తుందని పలు అధ్యయనాలు పేర్కొంటున్నాయన్నారు. అధిక దాహం, అధిక మూత్రం, నిస్సత్తువ, నీరసం, చిరాకు, నిద్రమత్తుగా ఉండడం, నరాలు మొద్దుబారడం వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. ఈవ్యాధి పట్ల నిర్లక్ష్యం చేస్తే గుండపోటు, మూత్రపిండాల సమస్య, నరాలు మొద్దుబారడం, కంటిచూపు సన్నగిల్లడం వంటి రుగ్మతలు ఎదురవుతాయన్నారు. స్థూలకాయం తగ్గించుకోవడం చాలా అవసరమన్నారు. ముఖ్యంగా రెండు పూటలా వ్యాయామం చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. జీవన సరళిలో మార్పులు అనివార్యమని డా.మల్లిబాబు అన్నారు. కొవ్వు, పిండి పదార్థాలు తగ్గించాలని, పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం అవసరమన్నారు. చక్కెర లేకుండా కాఫీ,టీ, పాలు, పెరుగు తీసుకోవాలని సూచించారు. చేపలు,గుడ్డులోని తెల్లసొన నిరభ్యంతరంగా తీసుకోవచ్చన్నారు. ఆపిల్, జామ, నేరేడు, పుచ్చకాయ, నారింజ, రేగు పండ్లు తినవచ్చునన్నారు. అన్ని రకాల ఆహార ధాన్యాలు తగు మోతాదులో తీసుకోవాలన్నారు. బూడిద గుమ్మడి, కాకర, వంగ, బెండ, చిక్కుడు, మునగ, బఠాణీ, బీర, దొండ, టొమాటో, ముల్లంగి తీసుకోవడం మంచిదని పేర్కొన్నారు. అన్ని పప్పు ధాన్యాలు, ఆకుకూరలను తినవచ్చన్నారు. దుంపలను మాత్రం పరిమితంగా తీసుకోవాలని సూచించారు. పీచు పదార్థాలు గల కాయగూరలు ఎక్కువగా తినాలని, నీరు ఎక్కువగా తాగాలన్నారు. నువ్వుల, వేరుశనగ, రైస్ బ్రాన్ నూనె వాడవచ్చునన్నారు. అయితే తీపి పదార్థాలను తీసుకోకూడదన్నారు. అరటి, మామిడి, సపోటా, సీతాఫలం, రామాఫలం, పనస, కొబ్బరికి దూరంగా ఉండాలన్నారు. మేక మాంసం, గుడ్లలో పచ్చసొన, మత్తుపానీయాలు, మాదకద్రవ్యాలు, పొగతాగుట, ఫాస్ట్ ఫుడ్స్ తీసుకోకూడదని పేర్కొన్నారు. ఒత్తిడిని తగ్గించుకోవడం అవసరమని, రక్తపరీక్షలు నెలకొకసారయినా చేయించుకోవాలన్నారు. లయన్స్‌క్లబ్‌ల పక్షాన అవగాహన, వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని డాక్టర్ మల్లి బాబు తెలిపారు.

# కార్మిక చట్టాలు అమలు చేయాలి

(సత్యంన్యూస్, మందస)

మందస జీడి, రైస్‌మిల్ కార్మికులకు కార్మిక చట్టాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. మందస మండలం రైస్ మిల్, జీడి పరిశ్రమల కార్మికుల సమావేశం సారంగిపురం సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో మాట్లాడుతూ జీడి, రైస్ మిల్లుల యాజమాన్యాలు కార్మికులకు కనీసవేతనాలు ఇవ్వడం లేదని, పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు చేయకుండా తీవ్ర శ్రమ దోపిడీకి గురిచేస్తున్నాయన్నారు. గత వేతన ఒప్పందం ముగిసి ఆరు నెలలు దాటినా నూతన వేతన ఒప్పందం చేయలేదని అన్నారు. జీడి, రైస్ మిల్లులు యాజమాన్యాలు కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడి వెంటనే ఒప్పందం చేయాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసారు. రైస్ మిల్ కార్మికులు బస్తాలు మోసినపుడు నడుం జారినా, యంత్రాలు వద్ద ప్రమాదాలకు గురయినా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని కార్మికులకు ఎటువంటి ఆసరా ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. కార్మికులకు చట్ట ప్రకారం పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ, విడిఎ, బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేసారు. వద్ద ఈ సమావేశంలో సిఐటియు మందస మండల కన్వీనర్ కె.కేశవరావు, డి.లక్ష్మి, కె.ధనలక్ష్మి, బి.భారతి, జి.బాలమ్మ, కె.శాంతమ్మ, సి.హెచ్. జానకమ్మ, కె.బాలకృష్ణ, బి.దుర్యోధన, పి.కూర్మారావు, కె.కృష్ణారావు, బి.వెంకటేశం, ఆర్.ఏకాశి, ఎన్.లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.




## 'సత్యం' కథనానికి స్పందన



(సత్యంన్యూస్, కొత్తూరు)

కంచిక చెరువులో 'ప్లాస్టిక్ వ్యర్థాలు' అనే శీర్షికతో ఈనెల 18న 'సత్యం'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఈమేరకు ఎంపీడీఓ నీరజన ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనపై తగిన ప్రణాళికలు రూపొందించాలని కార్యదర్శి పి.సూరిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌లకు ఆదేశించి ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులోని వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. దీనిపై రైతులు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆంధ్ర ప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గులు పోటీలు-2025 చేపట్టిన రంగవల్లులు పోస్టర్‌ను బుధవారం కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి దంపతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, సనపలఅన్నాజీ, టి.బి.జి గుప్త, కృష్ణ, మాధవ్, హేమ, సుబ్బారావు, జీవన్, హరీష్, వెంకీ, డిల్లేశ్వరావు సతీష్ తదితరులు పాల్గొన్నారు. – సత్యంన్యూస్, టెక్కలి



క్యాన్సర్ బారినపడిన శస్త్రచికిత్స చేయించుకున్న జలుమూరు మండలం, జలుమూరు గ్రామానికి చెందిన ముద్దు సూరమ్మ గారికి రూ.2,20,017 సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, బగ్గు అప్పారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునుకోటి దాముబాబు, సర్పంచ్ పంచిరెడ్డి రామచంద్రరావు, మునికోటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. – సత్యంన్యూస్, నరసన్నపేట

## కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసింది

(సత్యంన్యూస్, పాతపట్నం)



కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు మోసానికి గురయ్యారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. రాజ్యాంగం ఆమోదం దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం ఆమె మాట్లాడారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి పాలన సాగించారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి, కూటమి నాయకులు సంక్షేమాన్ని విస్మరించి అన్ని వర్గాల ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రైతులను రాజును చేయాలన్న సంకల్పం చేస్తే దానిని జగన్మోహనరెడ్డి కొనసాగించారన్నారు. కూటమి ప్రభుత్వం ఒక్క ధాన్యం కొనుగోలు కేంద్రం కూడా ఏర్పాటు చేయలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. వ్యవసాయ శాఖామంత్రిగా మన జిల్లాకు చెందిన మంత్రి అచ్చెన్నాయుడు రైతులకు రెండో పంట వేయొద్దని ఉచిత సలహాలు ఇవ్వడం తప్ప రైతులకు ఉపయోగపడే ఒక్క ప్రయత్నం కూడా చేయలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారన్నారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన నాయుడు ప్రచార ఆర్భాటలకే పరిమితమయ్యారు తప్ప రైతులకు, మహిళలకు, విద్యార్థులకు లబ్ధి కూర్చే ఏ ఒక్క ప్రయత్నం కూడా చేయట్లేదని తెలిపారు. అధికార దాహం, రాజకీయ లబ్ది, ఇసుక దోపిడీలు, మద్యం వ్యాపారాలతో ఎమ్మెల్యేలు బిజీగా ఉన్నారన్నారు. వీరిని అనుసరిస్తూ వారి అనుచరులు కూడా అదే బాటలో నడుస్తున్నారు తప్ప రైతులకు లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేయట్లేదన్నారు. రైతుల కన్నీరు తుడవలేని దుస్థితిలో ఉందన్నారు. రానున్న రోజుల్లో రైతులు కడుపు మండి తిరగబడే రోజులు దగ్గరలో ఉన్నాయని హెచ్చరించారు.

## రైతులు ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అల్పపీడనం కారణంగా జిల్లాలో ఈనెల 29వ తేదీ నుంచి మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి త్రినాధ స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే వరి కోతలు చేయని వారు వాయిదా వేసుకోవాలని, కోతలు జరిగి, పోలంలో వరి పనలు వున్నట్లైతే వెంటనే కుప్పలు పెట్టుకొని టార్పానులతో కప్పి జాగ్రత్త పరుచుకోవాలని సూచించారు. అలాగే నూర్పు జరిపిన ధాన్యంను సురక్షిత ప్రాంతాలలో భద్రపరచుకోవాలని, కళ్ళంలో ధాన్యం ఉన్నట్లయితే వెంటనే బస్తాలలో నింపుకొని ఇంటి వద్దగానీ లేదా దగ్గర్లోనే మిల్లు వద్ద గాని భద్రపరచుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల ప్రకారం షెడ్యూలింగ్ లేకపోయినా ధాన్యాన్ని ఆయా మిల్లులకు తరలించుకోవచ్చని స్పష్టం చేశారు.

# సంకల్పంతోనే సన్మార్గం



సత్యంన్యూస్, (శ్రీకాకుళం)

సంకల్పంతోనే విద్యార్థులు చదువుకున్న వయసులో చెడు వ్యసనాలకు, చెడు అలవాటులకు దూరంగా ఉండి సన్మార్గంలో నడవగలరని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాలను యువతకు వివరించి, వారిని చైతన్యపర్చి, మాదక ద్రవ్యాలు పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ప్రతిష్టాత్మకంగా "సంకల్పం" పేరిట మంగళవారం స్థానిక రాజీవ్ గాంధీ మెడికల్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటికే సంకల్పం పేరిట మొదటి ప్రాధాన్యతగా గంజాయి నిర్మూలన, మహిళలు చిన్నపిల్లలపై జరుగుతున్న దాడులు నియంత్రణ, సైబర్ నేరాలపై అవగాహన ,రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. 24 గంటలు ప్రజలకు సేవచేసే విభాగాలు పోలీసు, వైద్యవృత్తులని ఈ సందర్భంగా ఎస్పీ గుర్తు చేశారు. మాదక ద్రవ్యాల నియంత్రణ అన్నది నేడు సమాజం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య అని అన్నారు. ప్రస్తుతం మారుమూల గ్రామాల్లో సైతం గంజాయి వినియోగం పెరిగిపోయిందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో కూడా గంజాయి వాడకం ఎక్కువగా ఉందని తెలిపారు. సరదాకు వాడే మత్తు పదార్థాలు వలన క్రమేపి మానసిక పరిపక్వత్వాన్ని కోల్పోయి నేర ప్రవృత్తి వెట్కపు దారి మళ్లిస్తుందని తద్వారా ఉజ్వలమైన భవిష్యత్తు నాశనం అవుతుందని తెలిపారు. గంజాయి కేసుల్లో నిందితులుగా పట్టుబడితే చట్టాలు చాల కఠినంగా ఉన్నాయని కావున, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా ఉండాలని, ఒకవేళ అలవాటు పడిన వారెవరైనా ఉంటే ఎటువంటి సంకోచం లేకుండా డీ అడిక్షన్ సెంటరులో ప్రాధమిక స్థాయిలో చికిత్స పొందితే, వాటి నుండి బయటపడ వచ్చునని జిల్లా ఎస్పీ అన్నారు.డ్రగ్స్ కు బానిసలుగా మారిన యువత వారి అలవాట్లులకు సరిపడే డబ్బులు లేక చిన్నచిన్న దొంగతనాలకు పాల్పడి నేరస్థులుగా మారుతున్నారన్నారు.నేరస్థులుగా మారిన వారిపై పోలీసు నిఘా ఉంటుందని, వారు ఏ ఉద్యోగంలో చేరినా, విదేశాలకు వెళ్ళాలనుకున్నా పోలీసు వెరిఫికేషనులో వారి నేరచరిత బయటపడుతుందని, తద్వారా ఉపాధి, అవకాశాలు కోల్పోతారన్నారు. మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు అరెస్టులు కంటే అవగాహన కల్పించడంతోనే నిర్మూలించ వచ్చునని భావించి యువతలో చైతన్యం తీసుకొని వచ్చి, వారిని మాదక ద్రవ్యాల వైపు ఆకర్షితులు కాకుండా ఉండేందుకు, వాటి అలవాటు నుండి బయటపడేందుకు 'సంకల్పం' కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. విద్యార్థులు ఒకసారి డ్రగ్స్ ను వినియోగిస్తే ఏమీ కాదన్న భ్రమలో ఉంటారని,కాని డ్రగ్స్ ఒకసారి వినియోగించడం వలన త్వరితగతిన వాటికి బానిసలుగా మారుతారన్న వాస్తవాన్ని విద్యార్ధి దశలో ఉన్నప్పుడు గ్రహించలేరన్నారు. కావున కళాశాల పరిసర ప్రదేశాల్లో గంజాయి వంటి మత్తు పదార్థాలు ఎవరైనా క్రైస్తవ జరిపితే అట్టి వారి సమాచారాన్ని సంబంధిత పోలీసులకి తెలపాలని కోరారు. డ్రగ్స్ తో పాటు ఇతర సమాచారాన్ని కూడా తెలిపేందుకు రద్దీ ప్రదేశాలు, ఆర్టిసి కాంప్లెక్స్ లు కళాశాలలో పోలీస్ డ్రాప్ బాక్సులు ఏర్పాటు చేస్తున్నామని అట్టి బాక్సులలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని తెలపాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కోరారు. రిమ్స్ వైద్య కలశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట చలం మాట్లాడుతూ 18-25 సంవత్సరాల యువతకు ఆలోచన పరిజ్ఞానం చాలా తక్కువగా ఉంటుందని కావున ఏ నిర్ణయం తీసుకున్నప్పటికి ప్రణాళికబద్ధంగా విద్యను అభ్యసించి, చెడు అలవాట్లకు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని తెలిపారు. ఈ వయసులో యువత ఎక్కువగా మంచి కన్నా చెడికే ఆకర్షితులవుతారని కావున మత్తు పదార్థాల వలన అనేక అనర్థాలు, దుష్ప్రభావాలు కలుగుతాయి కాబట్టి అటువంటి వాటికి దూరంగా ఉండాలని ఆయన కోరారు. డ్రగ్స్ వినియోగం నియంత్రణ, మత్తు పదార్థాలు వినియోగం వలన కలిగే అనర్థాలు పై వైద్య విద్యార్థులు రూపొందించిన గోడ పత్రికలను జిల్లా ఎస్పీ తో పాటు ఇతరలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ వివేకానంద, టూ టౌన్ సిఐ ఈశ్వరరావు, ఎస్బి సిఐ ఇమాన్యూ వల్ రాజు, రాజీవ్ గాంధీ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ ప్రకాష్, పద్మా ,ప్రొఫెసర్స్ అసిస్టంట్ ప్రొఫెసర్స్ వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.











# 'కొంప'లు ముంచడంలో అలుపెరుగని 'మన్నం' వీరుడు

మొదటిపేజీ తరువాయి

చర్యలు తీసుకోలేదంటే.. సదరు ఉద్యోగి ఏ స్థాయిలో వ్యవహారం నడుపుతున్నాడో అర్థం చేసుకోవచ్చు. పంచాయతీ కార్యదర్శిగా మన్నం సతీష్‌పై నమోదైన అభియోగాలపై ఇప్పటివరకు అధికారులు, పోలీసులు జరిపిన దజనుకు పైగా విచారణల్లో డబ్బులు తీసుకున్నమాట వాస్తవమేనని, తీసుకున్న డబ్బుల్లో కొంత తిరిగి చెల్లించానని లిఖిత పూర్వకంగా, మౌఖికంగా అంగీకరించినట్టు విచారణ చేసిన అధికారులు చెబుతున్నారు. అయితే చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. దీనికి కారణం సతీష్ మోచేతి నీళ్లు తాగే అధికారులు జిల్లా పంచాయతీ శాఖ, జిల్లా పరిషత్‌లో ఉండడమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విచారణలో బాధితులు ఇచ్చిన వాంగ్మూలం, నగదు ట్రాన్స్‌ఫర్ చేసిన ఆధారాలు అధికారులకు సమర్పించినా సతీష్‌ను కాపాడే ప్రయత్నాలు చేస్తునేవున్నారు. న్యాయస్థానంలో కేసు విచారణలో ఉందని చెప్పి సతీష్‌పై చర్యలు తీసుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు.

శ్రీకాకుళం నగరం కంపోస్టు కాలనీలో నిర్మించిన 192 ఇళ్లల్లో 23 హుద్‌హుద్ ఇళ్లను 23 మంది మహిళలకు రాసిచ్చేశాడు. అంతేకాదు.. వాటి తాళాలను చూపించి వారి నుంచి తలా రూ.2 లక్షలు వసూలు చేశాడు. 23 మంది మహిళలు ఒక గ్రూపుగా ఏర్పడి రూ.50 లక్షలు సతీష్ చేతిలో పెట్టారు. బాధితుల్లో నగరానికి చెంది ఢిల్లీ, ముంబాయిలో నివాసముంటున్న మహిళలు ఉండడం విశేషం. వీరందరికీ ప్రాంశరీ నోట్లు ఇచ్చారని బాధితులు చెబుతున్నారు. 23 మంది మోసపోయినట్టు గుర్తించి సతీష్‌ను నిలదీయడంతో వీరి నుంచి వసూలు చేసిన రూ.50 లక్షల్లో రూ.25 లక్షలు రెండేళ్ల క్రితం వెనక్కి ఇచ్చేశాడు. మిగతా రూ.25లక్షలు ఇప్పటికీ ఇవ్వలేదని బాధితులు చెబుతున్నారు. సతీష్ బాధితుల్లో ఎక్కువ మంది ఆయన సామాజికవర్గానికి చెందిన వారితో పాటు సన్నిహితులు, బంధువులే కావడం విశేషం. బాధితుల్లో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ వేదికగా మోసాలకు పాల్పడితే, విభజన అనంతరం అమరావతికి మకాం మార్చుకున్నాడు. అమరావతిలో అనిల్‌కుమార్ అనే వ్యక్తి పేరు చెప్పి జిల్లాలో నిరుద్యోగులను ముంచేశాడు. తాను కేవలం మధ్యవర్తిగా మాత్రమే ఉన్నానని, దీనిలో తన ప్రమేయం లేదని సతీష్ వాదన వినిపిస్తున్నారు.

**బెదిరింపులు**

నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మకం కలిగించేందుకు డబ్బులు తీసుకొని కలెక్టరేట్, అమరావతిలోని సచివాలయం చుట్టూ తిప్పాడు. నిరుద్యోగుల నుంచి తీసుకున్న డబ్బులతో స్టార్ హోటల్స్‌లో బస చేసి జల్సాలు చేస్తుంటాడని బాధితులు చెబుతున్నారు. ఉద్యోగం రాలేదు కదా.. డబ్బులు తిరిగి ఇవ్వాలని బాధితులు ఒత్తిడి చేస్తే చెక్కులు రాసి ఇస్తుంటాడు. బాధితులు బ్యాంకు చుట్టూ కాళ్లు అరిగేలా తిరగడమే. చెక్కను బ్యాంకులో డ్రాప్ చేస్తే ఖాతాలో డబ్బులు లేవని తిప్పి పంపిన ఘటనలు లెక్కకు మించి ఉన్నాయని బాధితులు చెబుతున్నారు. ఫోన్ చేసి చెక్ బౌన్స్ అయిందని చెబితే గంట తర్వాత వెళ్లాలని, లేదంటే రెండురోజులు ఆగి వెళితే నగదు విత్‌డ్రా చేసుకోవచ్చని చెబుతుంటాడని బాధితులు వాపోతున్నారు. ఎవరైనా నిలదీస్తే అట్రాసిటీ కేసు నమోదు చేస్తానని బెదిరించడంతో పాటు నోటీసులు కూడా ఇచ్చినట్టు కొందరు చెబుతున్నారు. కేసులు పెట్టినంత మాత్రాన డబ్బులు వస్తాయా అంటూ బాధితులతో పరాచకాలు ఆడడం, కోర్టులు, తీర్పులు వచ్చే నాటికి అంతా అయిపోతుందని చెప్పి సతీష్ హెచ్చరిస్తుంటాడని బాధితులు చెబుతున్నారు.

**అమరావతిలో పరిచయాలతో..**

ఇరవై ఏళ్లుగా నిరుద్యోగులను ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగం, లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా ఆర్థిక ప్రయోజనాలు ఇప్పిస్తానని మోసం చేసి దోచుకున్నాడు. ఎన్ని కేసులు పెట్టినా, సస్పెండ్ చేసినా ఆయన వ్యవహారంలో మార్పు రాలేదు. కేసు పెడితే పోలీసులను, సస్పెండ్ చేస్తే అధికారులను మేనేజ్ చేస్తూ రెండు మూడు నెలల్లోనే విధుల్లో చేరిపోతాడు. పంచాయతీ కార్యదర్శిగా విధుల్లో ఉండకుండా ఆన్‌డ్యూటీ పేరుతో అందుబాటులో ఉండడని స్థానికులు చెబుతున్నారు. ఫేస్ రికగ్నైజ్ యాప్‌లో హాజరు వేయకుండా జిల్లా పంచాయతీ కార్యాలయంలో మేనేజ్ చేసుకుంటున్నాడని ఆరోపణలు ఉన్నాయి. అమరావతిలోని సచివాలయంలో అనిల్‌కుమార్‌తో పాటు మరికొందరితో ఉన్న పరిచయాలతో నిరుద్యోగులను బురిడీ కొట్టిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర సచివాలయానికి నిరుద్యోగులను తీసుకువెళ్లి అక్కడ పరిచయం ఉన్న ఉద్యోగులతో వీరిని మాట్లాడించి బురిడీ కొట్టించి డబ్బులు తీసుకుంటున్నట్టు బాధితులు చెబుతున్నారు. నిరుద్యోగులతో సంతకాలు పెట్టించడం, సర్టిఫికేట్‌లు తీసుకోవడం లాంటి చిల్లర పనులు చేసి వారికి నమ్మకం కలిగించేలా వ్యవహరించి నిండా ముంచేస్తున్నాడని బాధితులు చెబుతున్నారు.

## డెలివరీ బాయ్‌కు రూ.20వేలు సాయం



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)**

ఫ్లిప్‌కార్ట్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ ప్రమాదంలో కాలు విరిగిపోయి వైద్యం చేయించుకోడానికి ఇబ్బంది పడుతున్న వ్యక్తికి పెద్దపాడు యువత సాయమందించారు. కిల్లిపాలెం గ్రామానికి అలబాణ చిన్నారావు వృత్తిరీత్యా ఫ్లిప్‌కార్ట్ డెలివరీ బాయ్‌గా పనిచేసేవాడు. ఇటీవలే జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడి కాలు విరిగిపోయింది. తండ్రి కొంత కాలం క్రితం చనిపోగా, తల్లి కూలి పని చేస్తూ ఇల్లు నెట్టుకొస్తోంది. ఆరోగ్యశ్రీ కూడా చికిత్సకు వర్తించదని, చికిత్స కోసం సుమారు రూ.15 లక్షలు అవసరమని అపోలో వైద్యులు చెప్పడంతో, ఆర్థిక ఇబ్బందులతో చికిత్స చేయించుకోలేని స్థితిలో కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుత పరిస్థితి ప్రమాదకరంగా ఉందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పెద్దపాడుకు చెందిన యువత ముందుకు వచ్చి బుధవారం కుటుంబ సభ్యులకు రూ.20 వేలు నగదు సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పెద్దపాడు జనసేన పార్టీ నాయకులు బొట్టా శంకర్, బోర చిన్నారావు, కోరాడ సీతారాం, ఆవాల ఢిల్లీ, కె.యస్వంత్, మోషీ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు అందరి సహకారం అవసరం

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

బాల్య వివాహాలను నిర్మూలించడమే ప్రధాన లక్ష్యమని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి తెలిపారు. బుధవారం ఢిల్లీ నుంచి ఆమె వర్చువల్ విధానంలో నిర్వహించిన 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమానికి శ్రీకాకుళం ఎన్ఐసీ నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా అన్నపూర్ణా దేవి మాట్లాడుతూ బాల్య వివాహ ముక్త్ భారత్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యమని, పిల్లలు ఎదగడానికి, వృద్ధి చెందడానికి సురక్షితమైన వాతావరణం అవసరమన్నారు. దేశ వ్యాప్తంగా బాల్య వివాహాలను నిర్మూలించడానికి, ప్రయత్నాలను ముమ్మరం చేయడంలో భాగంగా కేంద్రమంత్రి అన్నపూర్ణా దేవి చేతుల మీదుగా 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' క్యాంపెయిన్‌ను బుధవారం ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో బాల్యవివాహాల నిర్మూలనకు అసాధారణ కృషి చేసిన కొందరు వ్యక్తులతో, బాల్యవివాహాలు ఎదుర్కొని విజయం



పొందిన ఎంపిక చేసిన 9 మంది పిల్లలతో వర్చువల్‌గా వారి అనుభవాలను కేంద్రమంత్రి మాట్లాడారు. బాల్యవివాహాలు ఎదుర్కోవడంలో, వారి విజయాల గురించి మాట్లాడటానికి ఎంపిక చేసిన 9 మందిలో ఎచ్చెర్ల మండలం కుంచాలకురమయ్యపేట గ్రామానికి చెందిన బుచ్చ రమణమ్మతో మంత్రి వర్చువల్‌గా మాట్లాడారు. బుచ్చ రమణమ్మ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా తనకు 14 సంవత్సరాల వయస్సులో వివాహం చేశారని, సదరు విషయం సమగ్ర బాలల పరిరక్షణ విభాగం, శ్రీకాకుళం వారికీ తెలిసి తన తల్లిదండ్రులకు పలుమార్లు కౌన్సిలింగ్ నిర్వహించి వివాహం రద్దు చేయించారని, ప్రస్తుతం బీటెక్ చదువు పూర్తి చేసుకొని, ఐటీ సొల్యూషన్ కంపెనీ, హైదరాబాద్‌లో జాబ్ చేస్తూ, మరెంతో మంది బాలికలతో తన అనుభవాలను పంచుకుంటూ, బాల్యవివాహాల నిర్మూలనకు తనవంతుగా కృషి చేస్తున్నానన్నారు.

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా హాజరైన అందరితో ప్రతిజ్ఞ చేయించారు. వర్చువల్ సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి శాంతిశ్రీ, పీవో ఎం.మల్లేశ్వరరావు, పీవో ఐఎల్ నాయుడు, వివిధ కళాశాలల నుంచి విద్యార్థినులు, వన్‌స్టాప్ సెంటర్ కోఆర్డినేటర్ హిమబిందు, కార్యాలయ సిబ్బంది హాజరయ్యారు.

## దివ్యాంగునికి ఎమ్మెల్యే శంకర్ భరోసా



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

అధైర్య పడవద్దు అన్నివిధాలా అండగా ఉంటానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశాఖ-ఏ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శ్రీకాకుళం రూరల్ గొల్లపేటకు చెందిన ఓ దివ్యాంగుడు ఎమ్మెల్యేను కలుసుకొని తన సమస్యలను విన్నవించాడు. అతని పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే శంకర్ అండగా ఉంటానని భరోసా కల్పించారు. గత ప్రభుత్వం దివ్యాంగులను పూర్తిగా విస్మరించిందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దివ్యాంగుల పెన్షన్లు పెంచి, వారికి అండగా ఉంటుందని పేర్కొన్నారు.

## ఆకాశవాణిలో డిసెంబరు 2న
# గౌరీశంకర్ కథ

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



కథా రచయిత, గాయత్రి కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ తెలుగు విభాగాధిపతి భమిడిపాటి గౌరిశంకర్ కథ 'మబ్బు చాటు వాన చినుకు' డిసెంబర్ రెండో తేదీన ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలో ప్రసారం కానున్నట్టు కేంద్రం డైరెక్టర్ ఫోన్ ద్వారా తెలిపారని గౌరీశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. గౌరీశంకర్ ఇంతవరకు వందకు పైగా కథలు, సాహితీ వ్యాసాలు రాసారు. ఏడు సంకలనాలు వెలువరించారు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో సభా నిర్వాహకునిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయనను నరసన్నపేట రచయితల అధ్యక్షులు సదాశివుని కృష్ణ, గాయత్రి విద్యాసంస్థల అధినేత జి.వి. స్వామినాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, సాహితీ మిత్రులు అభినందించారు.

# 108 కార్మికుల సమ్మె వాయిదా

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



ఈ నెల 11వ తేదీన 108 అంబులెన్స్ ఉద్యోగ సంఘం ఏపీ 108 సర్వీసెస్ కాంటాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్‌గా సమ్మె నోటీసును అందించి పలు ఆందోళన, నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. ప్రభుత్వం, యాజమాన్యం చర్చలు జరిపినప్పటికీ సానుకూలత కనిపించకపోవడంతో ఈ నెల 25 నుంచి సమ్మె చేయాలని నిర్ణయించారు. అయితే వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ ఎం.టి. కృష్ణబాబు ఆధ్వర్యంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ సీఈఓ మంజుల, అడిషనల్ సీఈఓ అప్పారావు, 108 నోడల్ ఆఫీసర్ డాక్టర్ మురుగప్ప ఉద్యోగ సంఘాల నాయకులతో ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్‌లో సుదీర్ఘ చర్చలు జరిపారు. సమ్మె నోటీసులోని అంశాలపై చర్చించారు. సమ్మె నోటీసులోని వివిధ అంశాలపై అంగీకారం కుదరడంతో రాతపూర్వకంగా మినిట్స్‌ను అందించారు. దీంతో సమ్మెను వాయిదా వేశారు. చర్చల్లో సంఘం గౌరవ అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరావు, రాష్ట్ర అధ్యక్షులు బల్లి కిరణ్‌కుమార్, జనరల్ సెక్రటరీ కె.వి.వి. నరసింహరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎన్. మహేష్, ట్రెజరర్ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆందోళన కాలంలో తమకు మద్దతు తెలిపిన వివిధ రాజకీయ పార్టీల నాయకులకు, ట్రేడ్ యూనియన్ నాయకులకు, వైద్య ఆరోగ్య సంఘం నాయకులకు, ప్రభుత్వ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**(సత్యంన్యూస్, ఎల్.ఎన్.పేట)**

రావిచంద్రి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు. అనంతరం ధాన్యం కొనుగోలుకు సంబంధించి అన్ని పరికరాలను, తేమ కొలిచే యంత్రాన్ని, తూకం యంత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నన్ను హింసించిన వారంతా జైలుకు వెళ్లడం ఖాయం

**అమరావతి:** సీఐడీ మాజీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్ అరెస్టును ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు స్వాగతించారు. కస్టడీలో తనను హింసించిన వారంతా జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. సీఐడీ మాజీ చీఫ్ సునీల్‌కుమార్ విదేశాలకు పారిపోకుండా లుకౌట్ నోటీసులు ఇవ్వాలన్నారు. రఘురామకృష్ణ రాజును కస్టడీలో వేధించిన కేసులో విజయ్‌పాల్‌ను మంగళవారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మరోవైపు ఆయన బెయిల్ పిటిషన్‌ను ఇటీవల సుప్రీం కోర్టు కొట్టివేసింది. మంగళవారం రాత్రినుంచి విజయ్‌పాల్ ఒంగోలు తాలుకా పోలీసుస్టేషన్‌లో ఉన్నారు. ఆయన్ను గుంటూరు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. నగరపాలెం పోలీసుస్టేషన్‌కు ఆయన్ను తీసుకురానున్నారు. గుంటూరు కోర్టులో హాజరుపరిచేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## వసంతరెడ్డి కుటుంబ సభ్యులు సాయం



**(సత్యంన్యూస్, టెక్కలి)**

గోవిందపురం గ్రామానికి చెందిన రెయ్యి వసంతరెడ్డి కుటుంబ సభ్యులు నిరుపేద కుటుంబాలకు సాయమందించారు. సంతబొమ్మాళి మండలం గోవిందపురం గ్రామానికి చెందిన మర్ల సవరయ్య గుండెకు రెండు స్టంట్స్ పడటం, నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో రూ.11 వేలు ఆర్థిక సహాయం, వల్లేవలస గ్రామానికి చెందిన కోటికి ఆరోగ్యం బాగులేకపోవడంతో ఆయనకు రూ.5 వేలు ఆర్థిక సహాయంతో పాటు 10 కేజీలు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.

# రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు మరోసారి కలిశెట్టి వినతి

**న్యూఢిల్లీ:** పార్లమెంట్‌లో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు రెండు ముఖ్యమైన విషయాలను సూచిస్తూ టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు సమక్షంలో విజయనగరం పార్లమెంట్ సభ్యులు, ఐ.టీ కమ్యూనికేషన్ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు మరోసారి వినతి పత్రం అందజేశారు. రాజాం, పాలకొండ, సీతంపేట, కోతూరు, హడ్డుబంగి, పర్లాకిమిడి ప్రాంతాల రైల్వే అనుసంధానం, ఈ ప్రాజెక్ట్‌పై డీపీఆర్ తయారీకి అనుమతులు తక్షణమే ఇవ్వాలని మరోసారి రైల్వేమంత్రిని కోరారు. ఆయన సూచనతో, సంబంధిత పరిశీలనలతో ప్రాజెక్టును త్వరితగతిన అమలుచేయాలన్న అభ్యర్థనను మంత్రికి అందించారు. ఒడిశా రాష్ట్రంతో అనుసంధానించుకునే విధంగా రైల్వే మార్గం ఏర్పాటుచేయడమనేది ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ఎంతో ముఖ్యమన్నారు. రైల్వేమార్గం స్థాపన కోసం త్వరగా ఒక సామర్థ్య అధ్యయనాన్ని ప్రారంభించాలని కోరారు. ప్రెస్ అక్రిడిటేషన్ కార్డులు కలిగిన పాత్రికేయులకు రైల్వే పాసులు మంజూరు చేయాలని, పాత్రికేయులు తమ కుటుంబంతో కలిసి ప్రయాణించేందుకు రైల్వే పాసులు మంజూరు చేయాలని కోరారు.



## కూటమి నేతల మధ్య ఫ్లైయాష్ వివాదం
# సీఎం చంద్రబాబు సీరియస్

**అమరావతి:** వైఎస్ఆర్ జిల్లా ఆర్టీపీపీ (రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్) ఫ్లైయాష్ వివాదం సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లింది. కూటమి నేతలపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఎంవో, జిల్లా అధికారులతో చంద్రబాబు మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ వివాదం ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఉందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతిభద్రతల సమస్య సృష్టించేలా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. శాంతిభద్రతల విషయంలో ఎక్కడా సమస్య రాకుండా చూడాలని, కఠినంగా ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. మొత్తం ఘటనపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.